వేదాంతభేరి

జూన్ 2017

రూ. 10/-

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 50 **జూన్ 2017** **సంచిక : 06**

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఏ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఏ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : **శ్రీ శుకబ్రహ్మాశ్రమము,**
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 50 **జూన్ 2017** **సంచిక : 06**

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. నిర్దుష్ట కర్మ - శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. శ్రీరామకృష్ణోపదేశం - శ్రీరామకృష్ణ పరమహంస - 10
05. సూక్తి సుధ- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 11
06. భారతదేశం - పునరుజ్జీవన మార్గాలు- శ్రీస్వామి వివేకానంద - 14
07. భక్త ఉద్ధవుడు - శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వాములవారు - 17
08. శుకమహర్షి బోధ - ఎస్.వి. భారతీలక్ష్మి - 23
09. పుష్పదంత విరచిత శివమహిమ్న స్తోత్రమ్
- శ్రీ బ్రహ్మవిద్యానంద స్వాములవారు - 26
10. శ్రీ మదాంధ్ర మహాభాగవతము - ఆచార్య జక్కపూడి మునిరత్నం - 30
11. సమాజంపై పారమార్థిక గేయాల ప్రభావం-డా॥ ఎడ్లబాలకృష్ణారెడ్డి-34
12. గోమాత సేవ - మిట్టపల్లి శంకరయ్య - 40
13. జ్ఞాన సదస్సు - 41
14. వార్తలు - 42

ముఖచిత్రం : స్కందస్వామి

28 - 6 - 2017 బుధవారం స్కంద పంచమి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. శ్రీ మత్పద్మభవేంద్ర ముఖ్య సుమనస్సేవ్యాంఘ్రినాళీక దు
ష్కామధ్వాంత దివాకరా శ్రితవిపత్సంహార యుద్యద్రిపు
స్తోమారణ్యదవానలా భవరుజాదుఃఖాబ్ధి సంతారకా
సామంజస్య మొసంగి బ్రోవుము నమస్కారంబు షాణ్మాతురా ! ॥

2. దురితఘ్నాయ దయాపరాయ నిగమస్తోత్రాయ దివ్యాయ ।
ఈశ్వరపుత్రాయ ద్విషడ్భుజాయ త్రిజగద్వంద్యాయ బాలాయ
దుస్తర దుఃఖ ప్రశమాయ సర్వజగదాధారాయ తుభ్యం నమః
సురసేనాగణ రక్షణాయ కరుణాశోభాయ షాణ్మాతురా !

3. పరమోదారక భవ్య భారక జగద్వంద్యాంఘ్రి నాళీక
దుర్భర దుర్మోహతమోనిరాసక, ప్రభావప్రాభవానల్పకా
అరివిధ్వంసక సౌఖ్యదాయక సముద్యద్భక్త మందారకా
కరుణాధారక ముక్తికారక విశాఖా దేవ షాణ్మాతురా ! ॥

4. సుబ్రహ్మణ్య భవాఘదూర శుభదా శుద్ధాత్మ శత్రుంజయా
శుభ్రాజిష్ణ సుభక్తపాలన మహాసూక్ష్మ స్వరూపాయితా
విభ్రంబుంబొనరింపకుండ నను సంవిత్ప్రాభవోపేతుగన్
విభ్రాజాత్ము నొనర్చి ప్రోవుము ప్రభూ విశ్వేశ షాణ్మాతురా ॥

5. కమనీయంబగు నీదురూపమును నాకన్నారవీక్షించి దేవ
మహానంద రసాబ్ధిలో మునిగి సంప్రాప్తైక చిత్తుండనౌచు
మనంబున్ మఱలింపజాల నిటులే సొంపార నీపైన
లగ్నము గావింపుము నాదు చిత్తము ననంతా దేవ షాణ్మాతురా!

– అగస్త్యరెడ్డి వెంకురెడ్డి (నెల్లూరు)



నిర్దుష్ట కర్మ

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జీవిత నిర్వహణమునకై ఆహారము అవసరము. కావున ఆహార సంపాదనార్థమై ఏదైన పని చేసికొనవచ్చుననియు. ఏదైన వృత్తిని జేబట్ట వచ్చుననియు పెద్దలు చెప్పుచున్నారు. శాస్త్రములున్ను అందులకు అనుమతి నిచ్చినవి. అయితే ఆ చేబట్టుపని నింద్యము కానిదై యుండవలెనని శాసించిరి. అధర్మము. అన్యాయము, అవినీతి వీనితో గూడినపని శాస్త్ర సమ్మతము కాదు. అది నింద్యమైనది. పాపభూయిష్ఠమైనది. అట్టి పని కర్తకు చేటు తెచ్చును. నరకమున బడద్రోయును. కాబట్టి అట్టి నింద్యకర్మను ఎవరును అవలంబించరాదు. ప్రోత్సహించరాదు.

అక్రమముగ సంపాదించిన ధనముతో పంచభక్ష్య పరమాన్నము లారగించినను, ఆ యాహారము జీర్ణము కాదు. క్లేశమునే కలిగించును. న్యాయముగ, సవ్యముగ సంపాదించిన కొలదిధనముతో అటుకులు తినినను, ఆ యాహారము పటుతరమై తిన్నవానికి శ్రేయమును చేకూర్చును.

పూర్వకాలపుమాట. అర్జునుని తీక్షణ బాణములచే భీష్ముడు పడిపోగా, అతడు పరుండి విశ్రాంతి గైకొనుటకు గాను అర్జునునిచే అంపశయ్య ఏర్పాటు చేయబడెను. స్వేచ్ఛా మరణము కలవాడగుటచే ఉత్తరాయణము వఱకు వేచియుండదలంచి భీష్ముడు ఆ అపంశయ్యపై పరుండి విశ్రాంతి గైకొనుచుండెను. అత్తఱి అతడు శ్రోతలకు చక్కని

బోధలు చేయుచుండెను. ఆ బోధలు వినుటకై జనులు ఒడలంతా చెవులు చేసికొని వినుచుండిరి. పంచపాండవులు, ద్రౌపది, ఇంకను ఎందఱో పెద్దలు అచ్చోటికి వచ్చి భీష్ముని అంపశయ్యచుట్టు చేరి కిక్కురు మనకుండ నిశ్శబ్దముగ, ఏకాగ్రతతో బాహ్య ప్రపంచ మంతయు మఱచిపోయి వినుచుండిరి. ఇట్లుండ అకస్మాత్తుగ మధ్యలో ద్రౌపది పక పక నవ్వెను. ఎందుకు నవ్వెనో ఎవరికిని అంతుపట్ట లేదు. భీష్మునకున్ను పరమాశ్చర్యము కలిగి బోధ చెప్పుటను నిలిపివైచి 'అమ్మా ! ఎందుకు నవ్వితివి ? ' అని ఆమెను ప్రశ్నించెను.

అందులకామె 'మహాప్రభూ ! గురుదేవా ! ఆనాడు కౌరవసభలో దుశ్శాసనుడు నా జుట్టు పట్టుకొని సభలోనికి ఈడ్చుకొనివచ్చి అవమానము చేయుటకై సిద్ధపడగా ప్రక్కనే కూర్చునియున్న మీరు ఒక్క మాటైనను చెప్పలేదేమి ? ఒక ధర్మ వాక్యమైనను చెప్పి ఆ దుష్టుని నివారించలేదేమి? ఇప్పుడిన్ని ధర్మములు చెప్పుచున్న మీరు అప్పుడు నోరెత్తలేదేమి ? అను విషయము నా మనస్సునకు జ్ఞప్తికిరాగా నవ్వు వచ్చినది. ఇంతియే " అని చెప్పగా అది విని కురువృద్ధుడిట్లు పలికెను. " ద్రుపదపుత్రీ ! నీవు చెప్పినది పరమసత్యము. అపుడు నేనేమియు పలుకలేదు. దుర్యోధనుని పాపిష్ఠి సొత్తు తిని నా రక్తము చెడిపోయినది. పాపభూయిష్ఠమైన అతని ఆహారము భుజించుటచే నా రక్తము చెడుటవలన తత్ప్రభావముచే నా మెదడు సరిగ పనిచేయలేదు. మంచి భావములు స్ఫురించలేదు. అర్జునుని పుణ్యామా అని ఈనాడు అతని బాణములచే నా పాడురక్తమంతయు కారిపోవ మంచి రక్తము మిగిలినది. అదుచే ఈనాడు చక్కని ధర్మబోధ నాకు స్ఫురించుచున్నది. ' భీష్ముని ఆ ప్రత్యుత్తరము గొప్ప ధర్మసూక్ష్మములతో గూడియున్నది. అన్యాయార్జితవిత్తముచే తెచ్చుకొనిన ఆహారము నాలుకకు స్వాదిష్టమైనను

హృదయమునకు శ్రేయస్కరము కాదు. కావున న్యాయార్జితాహారమునే మనుజుడు స్వీకరించవలెను. దానిచే రక్తశుద్ధి, రక్తశుద్ధిచే చిత్తశుద్ధి, చిత్తశుద్ధిచే మోక్షసిద్ధి చేకూరగలవు.

కనుకనే పెద్దలు ఆహారము కొఱకై ఏదైన నింద్యముకాని పనిని చేసికొనవచ్చునని ఆదేశించిరి. మఱియు నింద్యకర్మచే ప్రతిఫలముగ దుఃఖమే జీవునకు కలుగగలదు. పాపముచే దుఃఖము, పుణ్యముచే సుఖము, జ్ఞానముచే మోక్షము అనునది ఈ విశ్వమందు అనాదికాలము నుండి అమలులోనున్న చండశాసనము. విశ్వ ప్రభుత్వము యొక్క అప్రతిహతనియమము. కావున ఆ నియమమును జ్ఞప్తి యుందుంచుకొని పాపవృత్తిని దూరీకరించి, పుణ్యవృత్తినే చేపట్ట వలయును. కర్మమును చేయమన్నారు కదా యని ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించకూడదు. విశ్వశాసనమునకు అనుగుణ్యముగనే ప్రవర్తించ వలెను. కాబట్టి ఆహారము కొఱకై నింద్యము కాని పనినే చేసికొనవలెను. గాని నింద్యమైన దానిని కాదు. ఏ క్షేత్రమందును పాపము పనికిరాదు. అపకారము పనికిరాదు. అన్యాయము, అధర్మము అవినీతి, పనికిరాదు. నిప్పులో వ్రేలు పెట్టి తరువాత పశ్చాత్తాప పడినచో ప్రయోజనము లేదు. విశ్వశాసనమునకు తలఒగ్గి ప్రవర్తించవలెను. సత్కర్మయే తనను రక్షించును.

' ధర్మోరక్షతి రక్షితః '

ఈ ప్రకారములైన వివిధ సాధనల ద్వారా ముముక్షువు తన చిత్తమును శుద్ధ మొనర్చుకొని, ఆత్మజ్ఞానమును సంపాదించి అట్టి జ్ఞాన నేత్రముచే తనయథార్థస్వరూపమగు సచ్చిదానందమును గుర్తెఱింగి అద్దానియందు నిలకడ కలిగి బ్రహ్మానందానుభూతిని బడయవలయును.

సద్గురు వాణి

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

రోగులకు సరియైన పథ్యము పెట్టినచో వారికి తనపై అనిష్టము గల్గునని తలంచి వారి రోగ మెట్లైనను సరి, తనకు రావలసినది దొరికిన చాలునని బుద్ధిగల్గి ప్రవర్తించెడు వైద్యుడెట్టి వంచకుడో, ఆలాగున శిష్యులలోగల దుర్గుణములను ఖండించి, మంచి నిష్ఠను బోధించినచో తనపై వారికి ప్రీతి తొలగిపోవుననియు, తనకు రావలసిన దక్షిణ రాకపోవుననియు తలంచి యుపేక్షను పొందియుండు గురువు కూడ ఒక విధమగు వంచకుడనియే చెప్పవచ్చును. సత్యధర్మనిష్ఠులగు గురువు లెవరు నీలాగున చేయక యుందురుగాక ! అపేక్షలేని సరియైన శ్రేష్ఠుడైన వైద్యుడైనచో ఎట్టి వారికైన పథ్య విషయములో కఠినముగానే ప్రయత్నించును గాని, లోపము గలుగచేయడు. ఉత్కృష్ట గురువులును ఆలాగుననే ప్రవర్తింతురు.

ఎల్లప్పుడు రాత్రిగాని, లేక పగలుగాని, లేక, వర్షాకాలముగాని, లేక యెండాకాలముగాని యుండిన లోకములో ఒక్క ప్రాణిగాని, ఒక్క తృణముగాని బ్రతుకజాలదు, అలాగున ఓ సాధకుడా ! ఎల్లరు నిన్ను స్తోత్రము చేయవలెనని తలంపకుము. అట్లైన నీకు ఆత్మైక్యజ్ఞానము వృద్ధిగానేరదు. అంతేగాక ప్రమాదమునకు గూడ కారణము మెండుగ గల్గును. నిందించుట నీకు అభివృద్ధికి కారణమగును. అయితే నిందించుటకు కారణమేమియు నీయందుండరాదు. ఉండిన చెడును. ఇది నిజము.

శ్రీరామకృష్ణోపదేశం

- శ్రీ రామకృష్ణ పరమహంస

చౌదరీ : అయ్యా, గురువు సహాయం లేనిదే ఆధ్యాత్మిక జీవితం సఫలవంతం కాదా ?

శ్రీరామకృష్ణులు : సచ్చిదానందుడే గురువు. శవసాధన పరిసమాప్తిలో ఇష్టదేవతా దర్శనం అయ్యే సమయంలో గురువు దర్శనమిచ్చి " చూడు, ఇదుగో నీ ఇష్టదేవత " అంటాడు. పిదప ఇష్ట దేవతలో గురువు విలీన మవుతాడు. ఎవరు గురువో ఆయనే ఇష్టదేవత కూడా. ఇష్టదేవత వద్దకు చేర్చే మార్గగామే గురువు.

స్త్రీలు అనంతుడి నోములు నోచుతారు. కాని పూజచేసేదేమో విష్ణువుకు. అంటే, విష్ణువులోనే భగవంతుడి అనంత రూపాలు నెలకొని ఉన్నవి.

(రామ్ ప్రభృతులతో) ఏ మూర్తిని మేం ధ్యానించాలి అని నన్ను అడిగితే నే నిలా అంటాను. ' నీకు అమిత ఇష్టమైన మూర్తిపై నీ దృష్టిని కేంద్రీకరించు, కాని అన్ని రూపాలూ ఒకే భగవంతుడి రూపాలే అని ఖచ్చితంగా తెలుసుకో. ఏ మూర్తి పట్లా ద్వేషం వహించకు. శివుడు, హరి, కాళి –యివన్నీ ఒకేమూర్తి విభిన్న రూపాలు. వీరందరూ ఒక్కరే అని గ్రహించిన వాడే ధన్యజీవి.

బయటి కతడు శివభక్తుడు
మనసు కాళిపూజ సేయు
నాల్క పల్కు హరినామము
(భిన్న రూపులొకే బ్రహ్మ)

కామక్రోధాదులు లేశమైనా లేకుంటే దేహం నిలవదు. అందుచేత మీవంటి వారు వాటిని కనిష్ఠ పరిమాణంలోకి తగ్గించుకోవాలి.

సూక్తి సుధ

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య,
(తిరుపతి)

జీవకోటిలో మానవజాతి ఎంతో శ్రేష్ఠమైనదిగా భావింపబడుతున్నది. అందుకే తత్త్వవేత్తలు జన్తూనాం నరజన్మ దుర్లభమ్ – 'ప్రాణులలో మానవజన్మ దుర్లభ 'మని చెప్పారు.

అంత విలువైన మానవజన్మ వచ్చినా దాన్ని సద్వినియోగం చేసుకొనేవారు చాలా కొద్దిమందే వుంటారు. తన పుట్టుకను సత్కార్యాచరణ ద్వారా సార్థకం చేసుకొనేవాళ్లే ఉత్తమ మానవులనబడతారు. అలాకాక తమ దుష్టచేష్టలతో లోకానికి కీడు కలిగేటట్లు ప్రవర్తించేవారు అధములు. అటూ యిటూ కాకుండా బ్రతికేవారు మధ్యములు.

ఆధునిక మహనీయులలో అగ్రగణ్యులైన శ్రీమలయాళ స్వాములవారు నియమబద్ధమైన జీవితం గడపటానికి మొదలు బెట్టిన దశనుండే మానవత్వం ప్రారంభమవుతుందని చెప్పారు. 'న శ్రేయో నియమం వినా ' అని పెద్దల సూక్తి. నియమాన్ని పాటించనివారికి శ్రేయస్సు సిద్ధించదు. నియమరహితమైన జీవితానికి అలవాటు పడిన మానవులు పశుప్రాయులే.

మానవజీవితంలో – మృగావస్థ, మనుష్యావస్థ, దేవతావస్థ, ఈశ్వరావస్థ – లని నాలుగు దశలు ఉన్నాయని శ్రీమలయాళ స్వామిజీ చెప్పేవారు. ఈ నాల్గుదశలనూ వివరిస్తూ వారిలా అన్నారు.

"మృగావస్థలో వున్న మనిషి ఏ జీవిని ప్రేమించడు. మనుష్యావస్థలో వున్నవాడు తనబంధువులను మాత్రమే ప్రేమిస్తాడు.

ఇక చివరిదైన ఈశ్వరావస్థను చేరుకొన్న మానవుడు జంతువులనే కాక చెట్లనూ, పుట్లనూ, గుట్లను కూడా ప్రేమిస్తాడు. మానవజీవితానికి చరమ లక్ష్యం ఇలాంటి ఈశ్వరావస్థను పొందడమే.

ఒకసారి జంతువులన్నీ ఒకచోట సమావేశమై " మానవుడు మనకంటే ఏ విషయంలో గొప్ప ? బలం, ఆకారం మొదలైన అంశాలలో మానవుణ్ణి మించిన ప్రాణులు మనలోనే ఉన్నాయి కదా !" అని తర్కించుకొన్నాయట ! అవి అడవిలో తపస్సు చేసుకొంటున్న ఒక సాధువు దగ్గరకు వెళ్లి తమ సందేహం తీర్చమని అర్థించాయట ! అప్పుడా సాధువు " ఓ జంతువులారా ! మీరు పుట్టుకతో వచ్చిన స్వభావాన్ని వదలలేరు. మానవులు అలాకాదు. వారు ప్రయత్నంతో తమలోని దుష్ట స్వభావాన్ని తొలగించుకొని మంచి స్వభావాన్ని అలవరచు కోగలరు. తద్వారా ఆత్మోన్నతి సాధించుకోగలరు. యుక్తాయుక్త వివేకంతో ఉత్తమ జీవనం గడపగలరు. కాబట్టే మానవులు మీకంటే శ్రేష్ఠులుగా పరిగణింపబడుతున్నారు. అలా ప్రవర్తించకుండా నీచమైన జీవితం గడిపే మనుజులు మీకంటే అధములే" అని చెప్పాడట. !

ఈ కథవల్ల మనం గ్రహించవలసిన సత్యమేమంటే మానవుడు పరోపకారాది సద్గుణాలను అలవరచుకోవాలి. స్వార్థపరత్వాన్ని విడనాడాలి. త్రికరణశుద్ధి గల్గి నీతిమంతుడై జీవించాలి.

ప్రతి ప్రాణిలోనూ దైవత్వం దాగివున్నది. అది మానవునిలో మరింత ప్రస్ఫుటమై భాసిస్తున్నది. తనలోని దైవత్వాన్ని స్పష్టంగా వ్యక్తీకరించడమే మానవుని ముఖ్య కర్తవ్యం. విద్య వల్ల కలగవలసిన ప్రయోజనం కూడా అదే అని శ్రీ వివేకానంద స్వామి ప్రబోధించారు.

అసురలక్షణాలను అవలంబించినవారు అధోగతి పొందుతారనీ,

దైవలక్షణాలు కల్గివున్నవారు ఉత్తమ స్థితి నందుకొంటారనీ భగవద్గీత చెబుతున్నది. మానవుడు దైవత్వాన్ని పొందాలంటే కొన్ని ఉత్తమ ధర్మాలను పాటించాలని చెబుతూ శ్రీమలయాళస్వామి ఆ ధర్మాల నిలా వివరించారు.

' ఒక్కొక్కరూ వారి జీవనానికి సాధ్యమైనంత వరకూ పాపంలేని పనిని సమయం తప్పక శ్రద్ధతో చేయాలి. ఇతర ప్రాణులకు క్లేశం కలగకుండా జీవనయాత్ర సాగించాలి. ఇతరులను కష్టపెట్టేవాడు తానూ తప్పక కష్టపడవలసి వస్తుంది.

అధర్మమార్గంతో లభించే పంచభక్ష్య పరమాన్నాలు భుజించి జీవించడం కంటే ధర్మమార్గంతో వచ్చే అంబలి, గంజి త్రాగి జీవించడం శ్రేష్ఠతరం.

నీళ్లచే నిప్పును చల్లార్చునట్లు శాంతముచే కోపాన్నీ, త్యాగంచే లోభాన్నీ, శ్రద్ధచే అలసత్వాన్నీ జయించాలి.

ప్రకాశముచే చీకటిని తొలగించునట్లు కరుణచే కాఠిన్యాన్నీ, విరాగముచే రాగాన్నీ, దయచే భేదబుద్ధినీ జయించాలి.

నావచే సముద్రాన్ని దాటినట్లు విచారణ జ్ఞానముచే సంసారాన్నీ, యోగముచే మనస్సునూ, ధైర్యముచే శోకాన్నీ దాటవచ్చు.

వర్షముచే దావాగ్ని శమించునట్లు భక్తిచే తాపత్రయం, ప్రేమచే ద్వేషబుద్ధీ, జ్ఞానముచే అజ్ఞానమూ శమిస్తాయి. ఇలాంటి ధర్మాలను పాటించి మానవులు దైవత్వం పొందాలి.

భక్తునకు భగవంతునకు జయమగుగాక !

అనంత విశ్వములో ఈ భూగోళము ఒక చిన్న నలుసని భావించి, అహంకారమును దులిపివైచి, నీ సిరిసంపదలను గొప్పగా భావింపక, ఈ విశ్వమునకంతకును ప్రభువైన పరమాత్మ యెడల భక్తిప్రపత్తులు కలిగి యుండుము. – శ్రీ స్వామి విద్యాప్రకాశానంద

భారతదేశం : పునరుజ్జీవన మార్గాలు

– శ్రీ స్వామి వివేకానంద

ఈ భూమ్మీద పుణ్యభూమిగా నోచుకోబడే దేశం ఏదైనా ఉన్నది అంటే .... మార్దవతకు, ఉదారతకు, పవిత్రతకు, ప్రశాంతతకు, ఆత్మ పరిశీలనకు, ఆధ్యాత్మికతకు పరాకాష్ఠగా చెప్పుకోవలసిన దేశం ఏదైనా ఉన్నది అంటే – అది భారతదేశం ఒక్కటే.

భారతదేశ జాతీయ జీవితంలో ప్రపంచాన్ని కదలించి వేయగల ఆత్మజ్ఞానులు, మహాపురుషులు కొరవడిన ఒక్క కాలాన్నైనా ఎవరైనా చూపించగలరేమో సవాలు చేస్తున్నాను. ఈ దేశం కృషి ఆధ్యాత్మిక రంగానికి చెందినది. దీన్ని యుద్ధాలతోనూ, సైనిక దాడులతోనూ సాధించలేరు. ఈ దేశ ఆధ్యాత్మిక ప్రభావం ఇతర ప్రపంచ దేశాల మీద నిశ్శబ్దంగా, గుర్తింపు లేకుండా సున్నితమైన హిమంలా సదా పడుతూనే వచ్చింది. అయినప్పటికీ ఆ హిమం అందమైన పుష్పాలను వికసింప దోహదం చేసినట్లే, భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తూనే వచ్చింది.

మన మాతృదేశమైన భారతదేశానికి ప్రపంచం ఎంతో ఋణపడి ఉంది.

మత రంగంలో క్రైస్తవ మతం మీద భారతం ఎంతో ప్రభావాన్ని చూపింది. ఎందుకంటే ఏసుక్రీస్తు బోధనలు బుద్ధుని ఉపదేశాలలో ప్రతిధ్వనిస్తున్నాయి. విజ్ఞానశాస్త్రాల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. ప్రాచీనులకు భారతం శాస్త్రీయ దృక్పథంగల వైద్యులను ప్రసాదించింది. సర్ విలియం హంటర్ అభిప్రాయం ప్రకారం రకరకాల రసాయన

పదార్థాలను కనుగొనడం మూలంగాను, వికృత రూపంలో ఉన్న చెవులను, ముక్కులను సంస్కరించి మామూలు రూపంలోనికి తీసుకుని వచ్చే విధానాలను బోధించడం మూలంగానూ భారతదేశం ఆధునిక వైద్య శాస్త్రానికి కూడా దోహదం చేసింది. అంతకన్నా ఎక్కువగా గణితశాస్త్రంలో బీజగణితం, రేఖాగణితం, ఖగోళశాస్త్ర విభాగాల్లో గణనీయమైన శాస్త్ర పరిజ్ఞానాన్ని అందించింది. అంతేకాక ఆధునిక విజ్ఞానశాస్త్ర సాఫల్యానికి అనుకూలమైన వివిధ భాగాలతో కూడిన గణిత శాస్త్రాన్ని ఆవిష్కరించింది కూడా భారతదేశమే. ప్రస్తుత నాగరికతకు ఆధారమైన పది సంఖ్యలను కనుగొన్న ఘనత భారతానికే చెందుతుంది. వాస్తవానికి అవి సంస్కృత పదాలు.

తత్త్వశాస్త్రంలో ఇతర ప్రపంచ దేశాలకన్నా భారతం నేటికీ ఎంతో ముందంజలో ఉందని జర్మనీకి చెందిన సుప్రసిద్ధ తాత్త్వికుడైన స్కోపెన్‌హోవర్ అభిప్రాయపడ్డాడు. సంగీతంలో భారతం నిర్వహించిన పాత్ర అమోఘమైనది. మూల స్వర స్థానాలను నిర్దేశించి స్థాయి భేదాన్ని బట్టి సప్తస్వరాల పథకాన్ని ఆరోహణ, అవరోహణ క్రమంలో పొందుపరచి ప్రపంచానికి ప్రసాదించింది.... భాషోత్పత్తి శాస్త్రంలో మన సంస్కృత భాష ఐరోపా భాషలన్నింటికీ మూలాధారామని సర్వత్రా ఆమోదింపబడింది.

ఇక సారస్వత రంగ విషయానికి వస్తే మన ఇతిహాసాలు, కావ్యాలు, నాటకాలు ఇతర భాషా గ్రంథాలకు దీటైనవిగానే విరాజిల్లుతున్నాయి. జర్మనీకి చెందిన ఒక మహాకవి మన శాకుంతల నాటకాన్ని స్వర్గ మర్త్య లోకాల ఏకీకరణగా అభివర్ణించాడు. భారతదేశంలో రూపకల్పన చేయబడిన ఏసప్ కథలను, సద్గురు ఏసప్ మన రచన సంస్కృత గ్రంథం నుంచి అనుసృజించాడు. అదేవిధంగా అరేబియన్ నైట్స్‌ను అందించిన ఘనత భారతానికే చెందుతుంది. సిండరెల్లా, బీన్‌స్టాక్స్ కథలు సైతం భారతావని సృష్టే. ఇక వస్తూత్పత్తి రంగంలో ప్రత్తి ఉత్పత్తి, అద్దకం ప్రప్రథమంగా భారతదేశంలోనే చోటుచేసుకున్నాయి. వివిధ రకాల ఆభరణాల తయారీలో గణనీయమైన ప్రావీణ్యం సంతరించుకున్న దేశం మన భారతమే ! 'పంచదార ' అనే పదాన్ని, పంచదార అనే వస్తువును ఉత్పత్తి చేసిన కీర్తి భారతదేశానికే లభించింది. చదరంగం ఆటను, పేకాట, పాచికల ఆటను ప్రవేశపెట్టింది మన దేశమే. ఇలా అన్ని రంగాల్లోనూ భారతదేశం సాధించిన సర్వతోముఖ ఉన్నతి ఆకలిగొన్న ఐరోపా యోధశ్రేణులను మన దేశ సరిహద్దులకు చేర్చింది. ఈ ఘటనే వారు అమెరికాను కనుగొనడానికి పరోక్షంగా దారితీసింది.

నా దేశ చరిత్రను తిరగేసినప్పుడు ఒక విషయం నాకు స్పష్టమౌతోంది. మనిషి మానసిక ప్రగతికి ఇంతగా కృషి చేసిన దేశం ప్రపంచంలో మరొకటి లేనేలేదు. కనుక నా దేశాన్ని గర్వించడమన్న ప్రసక్తే లేదు, రాదు కూడా. నేను వారితో, " మీరు బాగా చేశారు, ఇంకా బాగా చేయడానికి ప్రయత్నించండి " అని మటుకు చెబుతాను.

దేనినీ నాశం చేయవద్దు

ఉన్మూలం చేయకండి. విగ్రహారాధనను నిరసించే సంస్కర్తలు ప్రపంచానికి ఏ విధమైన మేలు ఒనగూర్చలేరు. దేనినీ ధ్వంసం చేయవద్దు, కూలద్రోయవద్దు, నిర్మించండి, చేతనైతే సహాయపడండి. లేకుంటే చేతులు కట్టుకుని ప్రగతిని పరికిస్తూ నిలబడండి. సహాయ పడకపోయినా ఫరవాలేదు. హాని మాత్రం కలిగించకండి .... వ్యక్తి స్థితిని గ్రహించి ఆ స్థితి నుంచి అతణ్ణి ఉద్ధరించండి... నిజానికి నువ్వు ఏం చేయగలం? ఒక చిన్న బిడ్డకు సైతం బోధించగలనని భావిస్తున్నావా ? నువ్వు బోధించలేవు. బిడ్డ తనంతట తనే నేర్చుకొంటుంది.

(శ్రీరామకృష్ణ మఠం సౌజన్యంతో)

మూలం

భక్త ఉద్ధవుడు

అనువాదం :

శ్రీ అఖణ్డానందస్వాములవారు

(బృందావనం)

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

(మే నెల తరువాయి)

గుణాలతో ఏర్పడ్డ చిత్తం గుణాలను ఎలా విడనాడ గలుగుతుంది? అని ఆలోచించకు. చిత్తం నుండి గుణాలు దూరమవగలవు. చిత్తం గుణాలు రెండూ అన్యోన్యాశ్రితాలు, కానీ నా రూపం ఆరెంటికన్న అతీతమైంది. నన్ను గ్రహించగలవాని చిత్తం గుణాలు రెండూ విముక్తమైపోతాయి. వాటితో ఏకమవడం వల్లనే యీ బంధం ఏర్పడుతుంది. ఆత్మదృష్ట్యా వాటికి సత్తా లేదు. జాగ్రత్, స్వప్న, సుషుప్తులు అనే యీ అవస్థలు మూడు మనస్సంబంధమైనవి. వీటిని తిలకించేది ఆత్మే. నా మాయవల్లనే యివి నాలోనే నిర్మితమై యున్నాయి అని భావించి జ్ఞానకరవాలంతో వీటిని ఖండించు. కేవలం నన్నే భజించు. ఇవన్నీ ఏకమైనవి. కేవలం ఆత్మ మాత్రమే శాశ్వతమైనది. ఆత్మాతిరిక్తంగా గోచరించేవన్నీ మాయే. వాటి నుండి దృష్టిని మరల్చి తన్మయుడవైపో ”.

తన్మయుడవైన మీదట స్వరూపస్థితి ఏర్పడడంతో వినాశకరమైన శరీర దర్శనం కాదు. ఇది వున్నా లేకున్నా మానవుని దృష్టి అటుపోనే పోదు. ప్రారబ్ధం వున్నంతవరకూ శరీరం సజీవంగా ఉంటుంది. ప్రారబ్ధం క్షీణించడంతో యీ శరీరం పడిపోతుంది. తత్త్వజ్ఞానులైన మహాత్ములు ప్రపంచ, ప్రారబ్ధ శరీరాలపై దృష్టిని ఉంచరు. ఆ దృష్టియే వారి దృష్టి. ఇదే పరమతత్త్వము. ఇందులో స్థితుడై ఉండి సాధనలన్నింటి పూర్ణత్వంగా గ్రహించు.

“ ఈ జీవనలక్ష్యం ఏమిటి ? ” అన్న విషయమై అనేకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కానీ స్వేచ్ఛగా వ్యక్తం చేసే విషయానికి విలువ వుండదు. వారి దృష్టి సాంసారిక విషయాలపై లగ్నమై ఉండడం జరుగుతుంది. వారు వాటిని పొందగలుగుతున్నారు కూడ. ఒక్కొక్కపుడు ఆ లక్ష్యం నుండి పతనమై పోతూంటారు కూడ. సర్వాన్నీ ఉపేక్షించి నాకై ఆత్మ సమర్పణ చేయగలిగినట్టి వారు మాత్రం నా స్వరూపులే అవుతారు. అట్టి వారికి లభించే సుఖశాంతులు ఇతరులకు ఎలా లభిస్తాయి? నా భక్తులను నేను ప్రేమించేంతగా పరుల విషయం అలా వుంచగా నన్ను నేను ప్రేమించుకోను. నన్ను కోరేవారు మోక్షాన్ని కూడ అభిలషించరు.

నా భక్తుల సమక్షంలో విషయ ప్రలోభం రావచ్చును. పామరులు విషయ వశీభూతులైనట్లు నా భక్తులు కాజాలరు. వారికి నా ఆశ్రయం వుంది. నేను అన్ని విఘ్నాలను నాశనం చేసి వేస్తాను. సాధనలన్నింటిలోనూ నా భక్తే సర్వశ్రేష్ఠమైన సాధన, భక్తిద్వారా మాత్రమే నేను లభిస్తాను. నీచాతినీచాలను సయితం నా భక్తి పవిత్రులను చేస్తుంది. నా భక్తిలేనివారు ఎంతగా ధర్మాచరణను చేసినను యథార్థమైన పవిత్రత వారికి లభించదు. నా లీలలను ఆలకించినా రోమాంచం పొందనివారూ, ద్రవించని చిత్తాలు కలవారూ, కనుల నుండి అశ్రువులను రాల్చనివారూ, ప్రేమతో గద్గదత్వం పొందనివారూ, విశుద్ధాంతఃకరణులు కాజాలరు. నా ప్రేమలో ఉన్మత్తులై సంకోచరహితంగా ఆడుతూ, పాడుతూండేవారు. యావద్విశ్వాన్నీ పవిత్రం చేస్తారు. వారి బుద్ధి శుద్ధమవుతుంది. విషయధ్యానమగ్నులు నాశనమై పోతారు. నన్ను ధ్యానించునట్టివారు నన్నే పొందగలుగుతారు. కాబట్టి విషయాలనూ, విషయ వాసనాతత్పరుల సాంగత్యాన్నీ శీఘ్రంగా విడిచిపెట్టు. నీ చిత్తాన్ని నాపై లగ్నంచెయ్. నీకు శుభమంగళపరంపరలే చేకూరుతాయి.

“ ఆసనం వెయ్యి. ప్రాణాయామం చెయ్. ప్రణవాన్ని జపించు. శ్వాసతోబాటు నా నామాన్ని జపించు. నా మూర్తులలో దేనినైనా ధ్యానించు. ఎన్నో సిద్ధులు ప్రాప్తించవచ్చును. కానీ అవిమాత్రం వాంఛనీయం కావు. వాటివైపు కనులెత్తి కూడ చూడకు.

ఈ విశాలవిశ్వంలో నన్నే చూడు. ఉద్ధవా ! నా విభూతులు గణనాతీతంగా వున్నాయి. యత్నిస్తే ఎక్కడైనా నువ్వు నన్ను చూడగలుగుతావు.

బ్రహ్మచారివైతే బ్రహ్మచర్య వ్రతాన్ని పాలించు. గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసులలో ఎవరివైతే స్వశాస్త్రోక్త ధర్మాలను ఆచరించు. శాస్త్రం అంటే నా ఆదేశమే. శాస్త్రాజ్ఞలను పాలించడమంటే నా ఆదేశాలను పాలించడమే అవుతుంది. తదాచరణ సమయంలో సయితం నన్ను మరువకు. నా స్మరణమే వాటికి ప్రాణం.

ఉద్ధవా ! ఈ మానవ శరీరం అత్యంత దుర్లభమయంది. నీకు సులభంగా లభించింది. సంసారసాగరతరణానికి యిది నౌకలా పనిచేస్తుంది. గురువు దీనికి కర్ణధారుడై వున్నాడు. అనుకూలవాయువుగా నేనుంటాను. ఇట్టి దశలో అంటే యీ మహావకాశం లభించినా అపార సంసారసాగరాన్ని దాటగోరనివాడు తెలిసి వుండియే ఆత్మహత్య చేసుకుంటూన్నాడన్నమాట. అనుక్షణం ఆయుర్దాయం తరిగిపోతూంది. ప్రతిక్షణం మృత్యువు సన్నిహితమవుతూంది. సావధానుడవు కావాలి. ఈ శరీరం వుండగానే సంపూర్ణ లాభాన్ని అందుకో. నీ కర్తవ్యాన్ని పాలిస్తూ దుష్కర్మలను త్యజించు. ఆదిలో మానసిక దోషత్యాగ విషయంలో అసమర్థుడవైతే భయపడకు. శారీరక పాపవిముక్తుడవై నన్ను భజించు. భజన ద్వారా హృదయగత కామనలన్నీ నాశనమై పోతాయి. హృదయగ్రంథి విడిపోతుంది. సంశయాలన్నీ నాశనమైపోతాయి. నువ్వు కర్మాతీతుడవు కాగలుగుతావు. కర్మ, తపస్సు, జ్ఞానవైరాగ్యాలు, యోగదానాది సర్వోపాయాల ద్వారా లభించే ఫలం కేవలం నా భక్తి మాత్రంచే పొందగలుగుతావు. ఫలాన్ని ఆపేక్షించకు. నా భక్తులు నిరపేక్ష గానే వుంటారు. వారు మోక్షాన్ని కూడ ఆపేక్షించరు. నిరపేక్షత్వమే పరమ కళ్యాణప్రదమైంది. అదే నాయందలి యథార్థమైన భక్తి కూడ.

ప్రపంచంలో ఎవరూ ఎవరికీ సుఖదుఃఖాలలో దేనినీ యీయరు.

సర్వులూ తమ తమ కర్మలననుసరించే ప్రకృతి ప్రవాహంలో పడి కొట్టుకుపోతూంటారు. ఎవరినీ సుఖనిమిత్తాలనుభవించి అంటిపెట్టుకొని ఉండవు. అశాస్త్రీయములై ఆలస్యము వల్ల జరుగునట్టివైన కర్మలు తామసికాలవుతాయి. ఆసక్తితో చేసే కర్మలు రాజసికాలవుతాయి. బుద్ధితో యోచించి చేయబడునట్టివి సాత్త్విక కర్మలనబడతాయి. నన్నాశ్రయించి జరుగునట్టి కర్మలు నిర్గుణాలనబడతాయి. విషయభోగాలవల్ల కామనలు తృప్తి చెందవు. దీనికి ఒకటి కాదు అనేకమైన ఉదాహరణలున్నాయి. సామాన్యులు మొదలు సమ్రాట్టు వరకూ కోరికలనే అగ్నిలో దగ్ధమవుతున్నారు. నువ్వు పురూరవ చక్రవర్తి కథను విన్నావు కదా. కోర్కెలను పరిత్యజించు. ఆత్మలో పరమాత్మలో స్థితుడవుకా !

సర్వమూ ఆత్మే. సర్వమూ పరమాత్మే. అన్యులపై దృష్టిని పోనీయకు. నా లీలలనే దర్శించు. ప్రపంచమెందుకు ? ఎవరి కోసము? అని శంకించకు. కామనలే ప్రపంచము. వాటి సంస్మరణయే వాటి ఆవాగమనము. మహాత్ముల నిశ్చితాభిప్రాయమిదే. యథార్థానికి ఇదియే నా జ్ఞానము. " కేవలం నేనే " నేను వున్నాను. ఆదిలో లేని ప్రపంచం అంతంలోనూ వుండదు. మధ్య ఎక్కడ నుండి వచ్చింది ? కేవలం ఆత్మతత్త్వంలో అన్యాన్ని కల్పించుకోవడమంటే మోహం కాక మరేమిటి? ప్రియమైన ఉద్ధవా ! నువ్వు దీనిని అధిగమించి లే. సర్వే సర్వత్రా నన్నే చూడు. సర్వత్రా భగవద్భావాన్ని కలిగి సంచరించు. సర్వాధికమైన బుద్ధి ఇదే. సర్వార్థికమైన చతురత్వమిదే. అసత్యప్రపంచం ద్వారా సత్యపరమాత్మను పొందాలి. మృత్యుశీలమైన శరీరంతో అమృతత్వాన్ని అందుకో. నేను నీకు పరమజ్ఞానోపదేశం చేశాను. దీనిని అర్థం చేసుకోగలవారి సందేహాలన్నీ దూరమై వారు నన్ను పొందగలుగుతారు.

ఉద్ధవుడు అంజలిబద్ధుడై గద్గదకంఠంతో నయనాల నుండి అశ్రువులు జలజలరాలగా శ్రీకృష్ణ దేవుని శ్రీ చరణాలపై వ్రాలి పోయాడు.

ఏమీ మాట్లాడలేక పోతూన్నాడు. చివరకు కొన్ని క్షణాలకు సావధానుడై " పభూ ! నామోహాంధకారం దూరమై పోయింది. నువ్వు జ్ఞానజ్యోతిని ప్రసాదించావు. నీకు నాపై అపారమైన కృప వుంది. నేను నీ చరణకమలాలను ఎలా విడువగలను. ఇప్పుడు నా స్నేహబంధం విచ్ఛిన్నమైపోయింది. నీ పాదారవిందాలయందు నాకు గల భక్తి దృఢమగును గాక ! నేను కోరేది యింత మాత్రమే. "

అందుకు బదులుగా భగవంతుడు పలికాడు " ఉద్ధవా ! నువ్విక్కడ నుండి బదరీవనానికి వెళ్ళిపో. నా పాదోదకజలాలైన గంగలో స్నానం చేసి అలకనందా దర్శనమాత్రంచే పవిత్రుడవుకా. ప్రాకృతిక ద్వంద్వాలను సహిస్తూ అరణ్యంలోని ఫలపుష్పాలను ఆరగిస్తూ సర్వదా శాంతంగా ఇంద్రియాలను అదుపులో ఉంచుకుని జ్ఞానవిజ్ఞానాలకు ఎన్నడూ దూరుడవుకాకుండా వ్యవహరించు. నేను నీకు చెప్పిన విషయాలను ఏకాంతంతో అనుభవిస్తూండాలి. నీ మనోవాక్కులను నాయందు లగ్నం చేసి నేను చెప్పిన ధర్మాలలో సంలగ్నుడవై సంచరించాలి."

ఉద్ధవునకు తనదన్న వ్యక్తిత్వమేదీ లేదు. అతడు భగవదాదేశానుసారం నడిచేయంత్రం వంటివాడు. పరమాత్మ అతణ్ణి ఉంచ దలచినవాడు. అతడు వియోగదుఃఖాన్ని సహితం అనుభవిస్తూనే ఆనందంగా వుండగలడు. గోపికలనుండి అతడు నేర్చుకున్నది అదే కదా ! భగవంతుని విరహంలో ఎలా ఉండాలన్నదే గోపికల నుండి అతడు సాధించిన విశేష సాధన. అతడు భగవంతునికి ప్రదక్షిణ చేశాడు. తన కన్నీటి ధారతో అతని చరణ కమలాలను అభిషేకం చేశాడు. మాటిమాటికి ప్రణమిల్లి కృష్ణ విరహ వికలమానసుడై బదరికాశ్రమం వైపు పురోగమించాడు. సకాలంలో పరమాత్మ అంతర్ధానమై పోయాడు.

ఉద్ధవుడు యమునాతీరం చేరే సమయానికి ధర్మావతారుడైన విదుర మహాత్ముడు అతనికి దర్శనమిచ్చాడు. విదురుడు శ్రీకృష్ణయాద వాదుల కుశలసమాచారం అడిగాడు. అతని ప్రశ్నలనాలకిస్తూనే విదురుడు

భగవత్స్మృతిలో తన్మయుడై పోయాడు. బాల్యమాది ఇంతవరకు ఉద్ధవుడు శ్రీకృష్ణునితోనే ఉన్నవాడు. అతడే నేడు వాసుదేవుని నిజధామగమనవార్త వినిపించాలంటే అతని కెంత కష్టమో యోచించాలి. చాలసేపటి వరకూ అతడు శ్రీకృష్ణ చింతనలో తన్మయుడై పోయాడు. మనసా అతనికి భగవద్దర్శనం కలిగింది. అతడు భగవల్లీలా లోకంలోకి వెళ్ళిపోయాడు. అతని శరీరం పులకరించింది. కనుల నుండి అశ్రు ధారలు ప్రవహించాయి. ప్రేమధార అతని శరీరం నుండి పెల్లుబికింది. అతడు క్రమక్రమంగా తన స్థితిని పొంది కనులుతుడుచుకొని చిరునవ్వుతో విదురునితో అన్నాడు.

విదురా ! ఇప్పుడు ద్వారకలో ఏమీలేదు. శ్రీకృష్ణుడే అంతర్ధానమైపోతే నేను ఎవరి కుశలసమాచారం చెప్పగలను ? ఈ ప్రపంచం మహాదురదృష్టవంతమైంది. యాదవులు భాగ్యహీనులనడంలో సందేహమే లేదు. వాసుదేవునితో వుంటూకూడ వారతణ్ణి గుర్తించలేదు. అతని కనుసన్నలను అనుసరించి సంచరించే వారూ. అతనితో ఆడి పాడి, తిని త్రాగినవారు, అతనిని యదువంశ శ్రేష్ఠునిగా మాత్రమే గుర్తించారు. భగవన్మాయయే యిట్టిది. పరమాత్మ ఎవరిని కరుణించదలచు కుంటాడో వారే భగవంతుని గుర్తించగలుగుతారు. పరమాత్మ అతృప్త నేత్రాలను తృప్తిపరచాడు. మరణాసన్నులకు జీవనదానం చేశాడు. అతని సన్నిధికి వచ్చిన వారందరికీ కళ్యాణమార్గాన్ని తెరచి వుంచాడు. అట్టి వారిని ఉద్ధరించాడు. పరమాత్మయొక్క సాహచర్య. సాన్నిహిత్యాలలో జీవనం సాగించిన ఉద్ధవుడు ధన్యుడు.

వేదాన్తభేరి పత్రికకు ఈక్రింది వారు పోషక చందా పంపినవారు

01. శ్రీమతి లక్ష్మీనరసమ్మ (కూనూరు, తమిళనాడు) –రూ.10000/–
02. బి.వి.రజనీకాన్తరావు (శ్రీకాకుళం) – రూ.1500/–
03. కొక్కల్ల బాలస్వామి (వనపర్తి) – రూ.1500/–

శుకమహర్షి బోధ

– శిష్టా విజయ భారతీలక్ష్మి (భీమవరం)

చిత్తము విషయసుఖముల వెంటపడి బ్రహ్మాభ్యాసమునకు ప్రతిబంధకము కలిగించుచుండును. చిత్తనాశనమునకు యోగము, జ్ఞానము అను రెండు మార్గములు చెప్పబడుచున్నది. యోగము వలన చిత్తనిరోధము గలుగును. అనగా ఆలోచనల నరికట్టు మార్గము యోగము. " యోగః చిత్తవృత్తి నిరోధః" అని పతంజలి వాక్కు. జ్ఞానము వలన సమ్యగ్వివేకము గలిగి తద్ద్వారా మోక్షము లభించును. ' జ్ఞానా దేవహి కైవల్యమ్ ' అని శ్రుతివాక్కు. అట్టి మోక్షము బ్రహ్మానం దానుభూతిని కలిగించును. అదియే సంసార దుఃఖ సంయోగ రహితస్థితి. కనుక యోగము కంటే జ్ఞానము శ్రేష్ఠము. జ్ఞానము సద్గురువుల బోధ వలన ప్రాప్తించును. సద్గురువు పూర్వజన్మ సంస్కారమువలన లభించును.

శుద్ధ సత్వస్వరూపుడును, ఆత్మకు అధిష్ఠానమునగు పరమాత్మ సృష్టి కాలమున ఇంద్ర జాలకుని వలె 14 భువనములను సముద్రము నుండి తరంగములు వెలువడి మరల సముద్రములోనే ' లయించినట్లు – తన నుండి వెలుపలికి జూపి తనయందే లయం చేసుకొంటున్నాడు. సముద్రము నుండి వెలువడిన తరంగములు సముద్రము కంటె వేఱు కాదు. అలాగే, పరమాత్మ నుండి వెలువడిన సకల భువనములు పరమాత్మ కంటె వేఱు కాదు. దర్పణమున కెదురుగా నున్నప్పుడు ముఖ ప్రతిబింబము కనబడును. దర్పణము లేనప్పుడు ముఖమునకు అభావము లేదు. ఎప్పటి యట్లే సాక్షి మాత్రంగా నుండును. అట్లే దర్పణ ప్రతిబింబము వలె ఆభాసగా తనలో నుండు విశ్వమును స్వప్నము నందు సత్యమైన నగరము వలె ప్రత్యక్షముగా దృశ్యమై, మెలకువ

రాగానే స్వప్నమునకు సాక్షియై తానొక్కడే శేషించి యున్న పరమాత్మ అద్వయానంద స్వరూపుడు.

శుద్ధ సత్వ స్వరూపుడైన పరమాత్మ వలన అవ్యక్తము (ప్రకృతి – మాయ) , అవ్యక్తము వలన మహత్తత్త్వము (అవ్యాకృత సూక్ష్మ జగత్తు – సమష్టి బుద్ధి), దాని వలన పంచతన్మాత్రలు (శబ్ద స్పర్శ రూప రస గంధములు) వాటి వలన పంచ మహా భూతములు (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి) సృజింపబడినవి. బ్రహ్మము నుండి సృష్టింపబడిన అవ్యక్తము సత్వ రజస్తమో గుణములుగా మూడు విధములైనది. అవి మరల సమష్టి, వ్యష్టి అను రెండు విధములుగా విభజింపబడినవి. సత్వ సమష్టి వలన అంతఃకరణ చతుష్టయము (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము) యేర్పడినది. సత్వ వ్యష్టి వలన పంచ జ్ఞానేంద్రియములు (త్వక్కు, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములు) యేర్పడినవి. రజో సమష్టి వలన ప్రాణ పంచకము (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు), రజో వ్యష్టి వలన పంచ కర్మేంద్రియములు (వాక్కు, పాణి, పాద, పాయువు, ఉపస్థ) యేర్పడినవి.

తమోగుణ ప్రధానమగు ప్రకృతి నుండి ఈశ్వర సృష్టి జరిగినది. పంచభూతములను రెండు భాగములుగా విభజించి అందలి అర్ధ భాగమును అక్కడనే యుంచి మిగిలిన అర్ధ భాగమును నాలుగు భాగములుగా చేసి 1/2 + 1/2 చొప్పున కలిపిన యెడల గోళకము లేర్పడినవి. గోళకములే లోకములు.

లోకంబులు లోకేశులు
లోకస్థులు దెగినదుది, నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం

దేకా కృతి వెలుగు నతని నే సేవింతున్

లోకము లనగా గోళకములు. గోళము లనగా యింద్రియ స్థానములు. లోకేశులనగా యింద్రియ దేవతలు. తెగిన తుది యనగా, నశించిన పిమ్మట సృష్టి క్రమముగా లయమగును. అనగా వాగింద్రియమును మనస్సు నందును, మనస్సును బుద్ధియందును, బుద్ధిని మహత్తత్త్వము నందును, మహత్తత్త్వమును అవ్యక్తము నందును లయం చెయ్యగా యేకాకారమై వెలుగొందు మనోవాక్కుల కతీతమైన పరమాత్మ దర్శనమగును. అట్టి పరమాత్మను సేవింతునని గజేంద్రుడు ప్రార్థించాడు.

శ్రీ మద్భాగవతములోని గజేంద్రమోక్షమను ఆఖ్యానంలో శుకమహర్షి బోధించిన అద్వైత తత్త్వమును అనుభూత మొనర్చుకొన్న సాధకులు తరించగలరని తత్త్వజ్ఞుల అభిప్రాయం.

ఈ వ్యాసము శ్రీ చదువుల వీర్రాజు శర్మ గారు ' అనుభవ వేదాంత ప్రదర్శకులు " (శృంగవరపు కోట) 1954 సం॥లో రచించిన 'గజేంద్ర మోక్షము - రహస్యార్థము ' అను గ్రంథము నుండి శుకమహర్షి బోధించిన అద్వైత తత్త్వమును మాత్రము యథాశక్తిగా సంగ్రహించడమైనది. **ఓం తత్ సత్**

భక్తులైనచో తనకు కనుపించున దంతయు దైవమయముగాను, జ్ఞాని అయినచో తన ఆత్మకన్న వేఱు అణుమాత్రమైనను లేదనియును భావన చేయవలెను. అట్టి భావశుద్ధి గలవారు మాత్రమే జ్ఞానసిద్ధిని పొందగలరు. భావశుద్ధియే జ్ఞాన సిద్ధి, చిత్తైకాగ్రతకు కొంచెము ప్రాణాయామాది యోగము కూడా యుండవలయును.

- శ్రీ మహర్షి మలయాళస్వాములవారు



పుష్పదంత విరచిత శివమహిమ్న స్తోత్రమ్

శ్రీ మధుసూదన్‌టీక - తదనువాదం

- అనువాదకులు శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

(మార్చి తరువాయి)

మధుసూదనీ టీక : మహిమ్నః పారమితి. హేహర ! సర్వాణి దుఃఖాని హరతీతి హరః । యోగ్యం సంబోధనమ్ । సర్వదుఃఖహరత్వేనైవ ప్రసిద్ధోఽసి, న మమ దుఃఖహరణే పృథగ్వ్యాపారం కరిష్యసీత్యభిప్రాయః। హే సర్వ దుఃఖహర, తే = తవ మహిమ్నః పరం పారం = అవధిం, అవిదుషః = ఏ తావానేవ మహిమేతీయత్తయా అజానతః । కర్తృత్వ సంబంధే షష్ఠీ। అజానత్కర్తృకా స్తుతిః, యది అనదృశీ - ఆననురూపా, అయోగ్యేతియావత్। తత్తర్హి బ్రహ్మాదీనాం సర్వజ్ఞానామపి గుణకథన రూపా గిరస్త్వయి విషయే ఽవసన్నాః । అయోగ్యా ఏవేత్యర్థః । తైరపీ యత్తయాఽజ్ఞానాత్ ఇయత్తాయా అసత్త్వేన తదజ్ఞానే సార్వజ్ఞ్య వ్యాఘాతోఽపిన. సన్మాత్ర విషయత్వాత్సర్వజ్ఞత్వస్య । అన్యథా భ్రాన్తత్వ ప్రసజ్గాత్ । తథాచ శ్రీ భాగవతే.

శ్లో ॥ విష్ణోర్ను వీర్యగణనాం కతమోఽర్హతీహ, యః పార్థివాన్యపి కవిశ్విమమే రజాంసి " ఇతి / అథేతి పక్షాన్తరే యద్యేవం బ్రూషే తర్హి స్వమతిపరిణామవధి = స్వస్యమతి పరిణామో బుద్ధి విషయతా స ఏవావధిర్యత్రేతి క్రియా విశేషణమ్స్వ బుద్ధ్యా యావద్విషయీకృతం తావద్గృణన్ - వాక్సృష్టి సాఫల్యాయ కథయన్సర్వోఽపి స్తోతాఽవాచోఽను పాలమ్భనీయః । " సావాగ్యయా తస్సగుణాన్గృణీతే కరౌచ తత్కర్మకరౌ

మనశ్చ । జిహ్వాసతీ దాదురికేవ సూత వచోపగాయత్యురు గాయగాథాః।
ఇతిచ శ్రీ భాగవత వచవాత్ । తర్హి ' నభః పతన్త్యాత్మసమం పతత్రిణః "
ఇతి న్యాయేన మమాప్యేష పరికరః = ఆరమ్భః, స్తోత్రే = స్తోత్ర విషయే
నిరపవాదః = అఖణ్డనీయః. స్వబుద్ధ్యనుసారేణ యోగ్య ఇత్యర్థః. ప్రథమార్ధేన
స్తుతి నిరాకరణ వ్యాజేన సర్వ దురధిగమ మహిమత్వరూపా మహతీస్తుతిః
కృతా, ఉతరార్ధేన స్తుతి సమాధాన వ్యాజేన సర్వా స్తుతిరనురూపేతి
మహత్కౌశలమ్ ।

అనువాదం : హే హర ! (సర్వ దుఃఖములను హరించు వాడవు గనుక ' హర ' అను నామము నీకు అన్వర్థమై యున్నది. మరియు ' సర్వ దుఃఖ నాశకుడ'వని నీకు లోకములో ప్రసిద్ధి గలదు. గావున 'హర' అను సంబోధనము ఉచితమే, అందువలన నా యొక్క దుఃఖములను నాశనము చేయుటకు నీవు పృథగ్వ్యాపార మవసరముండదు), హే సర్వ దుఃఖ హరా ! (నీవు ఇంతటి గొప్ప వాడవు అని) నీ మహిమ యొక్క పరమావధిని (అంతును) తెలియలేని సామాన్య మనుష్యునిచే చేయబడు నీ స్తుతి ఒకవేళ అయోగ్యమయినట్లైతే సర్వజ్ఞులైన బ్రహ్మాది దేవతలచే నీ విషయమై చేయబడు గుణకథనరూప వాణి (స్తుతి) గూడ అయోగ్యమేయగును. ఎందుకనగా ! నీ యొక్క పరిమాణమును, గుణగణముయొక్క సీమను (అవధిని) వారు గూడ యెఱుగజాలరు. పరమేశ్వరుని యొక్క ఆవాఙ్మానస గోచరమగు స్వరూపమును, అనంత గుణములను సంపూర్ణముగా యెవరును తెలిసికొనజాలరు. ఇంత మాత్రముచే బ్రహ్మాదుల సర్వజ్ఞత్వమునకు గూడ భంగము వాటిల్లదు. ఎందుకనగా, సర్వజ్ఞత్వము విద్యమానవస్తు మాత్ర సంబంధియైయుండును. అట్లుగాక, అవిద్యమాన వస్తువును తెలిసికొన్నచో, వారు భ్రాంతపురుషులే యగుదురు. (విద్యమానవస్తువు పరబ్రహ్మము. అదియే సద్వస్తువు తద్భిన్నము సకలము అసత్, అవిద్యా కల్పితము. పరమేశ్వరుని యొక్క విభూతి " యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమ్" " ఆత్మని ఖల్వరే దృష్టే, శ్రుతే, మతే, విజ్ఞాతే ఇదంసర్వం విదితమ్ " ఇత్యాది ప్రతివేదాంత ప్రతిపాదిత ప్రతిజ్ఞానురోధముచే సర్వజ్ఞత్వము సన్మాత్ర విషయమై యుండును. కావున బ్రహ్మోపేంద్రాది దేవతల సర్వజ్ఞత్వమునకు హానిలేదు.

ఒకవేళ నీవిట్లనెదవేమో " ఏ పరమాత్మచే పృథివ్యాదుల సూక్ష్మ రజః కణముల పర్యంతము రచింపబడెనో, ఆ భగవంతుని గుణగణన ఎవరు చేయగలరు ? (శ్రీ మద్భాగవతము) అన్యత్ర గూడ " న యస్యాలమపి బ్రహ్మ మహిమానం వర్ణితుం " చతుర్ముఖబ్రహ్మగూడ యెవరియొక్క మహిమను (విభూతిని) సంపూర్ణముగా వర్ణించలేడో - (స్కంధ పురాణము - మహే- కౌమార 33-20/1). కావున భగవంతుని మహిమను ఎవరును (ఇయత్తయా) ఇదమిత్థమంటూ పూర్ణముగా తెలిసికొనజాలరు. అలాంటప్పుడు నీవెందుకు నన్ను స్తుతించుటకు వృథా ప్రయత్నము చేసెదవు ?

ఇట్లు ప్రాప్తించగా సర్వులు నిన్ను స్తుతించుట కధికారులే, అందరి యొక్క స్తుతి అనురూపమే (యోగ్యమే) యని ప్రతిపాదిస్తూ పక్షాంతరము (అన్య ప్రకారము) చే సమాధానము చెప్పుచున్నాడు. 'స్వమతి పరిణామావధి గృణన్ ' అంటూ ఎవరి బుద్ధిలో ఎంతగోచరించు (స్ఫురించు)నో, వారి బుద్ధి విభవానుసారము (బుద్ధి శక్తి కొలది) నిన్ను కీర్తించి కృత కృత్యులుగా భావించి వాక్సాఫల్యమును పొందు చున్నారు. " నభః పతన్త్యాత్మసమం పతత్రిణః, తథాసమం విష్ణుగతిం విపశ్చితః " ఎట్లు పక్షి ఆకాశములో ఎగురగలినంత వరకు (తన శక్త్యనుసారము) ఎగురుతుంది. అట్లే విద్వజ్జనులు వారి బుద్ధికౌశల్యము

ననుసరించి విష్ణు భగవానుని లీలలను వర్ణించుచుదురు. మా స్తుతి అననురూపమని (అయోగ్యమని, నిందనీయమని) అనుకోవడము లేదు. పై భాగవతగత న్యాయముచే నీ స్తుతి విషయక నా యీ ప్రయత్నము గూడ అపవాద శూన్యమే యగును. అనగా నా బుద్ధి శక్త్యనుసారము ఉచితమై ఉంది. శ్రీమద్భాగవతములో ఇట్లు చెప్పబడినది. “హే సూత! పురుషుడు యే వాణిచే భగవంతుని గుణములను కీర్తించునో, ఆ వాణియే వాని? ఏ చేతులు భగవత్సం బంధమగు కర్మ చేయునో, ఏ మనస్సు అతని గూర్చియే మననము జేయునో, ఆ చేతులే , ఆ మనస్సే శ్లాఘనీయములు. “ శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ ” ఏ నాలుక విష్ణుగాథలను గానము చేయునో, అదియే సార్థకము. లేనిచో అది మండూకము (కప్ప) నాలుకతో సమానము. ” అను శ్లోకము యొక్క పూర్వార్థముచే “ భగవంతుని మహిమ (విభూతి) అనంతము గావున అతని మహిమావధిని ఎవరు గూడ సంపూర్ణముగా తెలియలేరు” అని స్తుతిఖండన నెపముచే గొప్పగా స్తుతించి, ఉత్తరార్థములో స్తుతి సమాధాన నెపముచే (మిషచే) సర్వుల స్తుతి అనురూపమే (యుక్తమే) అను అపూర్వ కథనము గంధర్వ రాజుయొక్క మహత్కౌశలము.

ఆశ్రమ కంటి ఆసుపత్రి నిమిత్త త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు
ఈ క్రిందివారు పైకం పంపినవారు

01.అత్యం వెంకటాచలం (పెనుగొండ, ప.గో.జిల్లా) రూ.66,699/-
02. ఎల్.పి. నరసింహులు (చెన్నై) రూ. 10,000/-
03. గంగా ప్రకాశ్ (వర్నీ, నిజామాబాద్ జిల్లా) రూ. 10,000/-
04. కె. జగదీశ్వరన్ (రిటైర్డ్ హెచ్.ఎం. శ్రీకాళహస్తి).రూ.10,000/-
05. డి.వి.ఎస్.వి. సుందరరావు (సౌదీ అరేబియా) రూ. 10,000/-

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(ఏప్రిల్ తరువాయి)

వృద్ధజన సందర్శనం : పుత్రులందరినీ కోల్పోయిన గాంధారీ ధృతరాష్ట్రుల దగ్గరికి శ్రీకృష్ణుడు వెళ్ళాడు. వారికి ఓదార్పు కలిగించాడు. కుంతీదేవి ఎన్నో కష్టాలు అనుభవించింది. పైగా కర్ణుడి మరణంతో పుత్రశోకాన్ని కూడా అనుభవిస్తూ ఉంది. కృష్ణుడు ఆమె దగ్గరకు కూడా వెళ్ళి ఓదార్చాడు.

బంధువులందరూ యుద్ధంలో మరణించినందులకు తానే కారణమని ధర్మరాజుకు అనిపించింది. తల్లడిల్లిపోయాడు. శ్రీకృష్ణుడు, వ్యాసుడు, ధౌమ్యుడు మొదలైన మహనీయులెందరో ధర్మరాజును ఊరడించారు. అయినా ఆయనకు ఊరట కలుగలేదు. గురువులనూ, బాలకులనూ, బ్రాహ్మణులనూ, కొడుకులనూ, సోదరులనూ యుద్ధంలో చంపించినందుకు నూరువేల సంవత్సరాల నరకం తప్పదని యుధిష్ఠిరుడి మనసు ఘోషించింది. ధర్మరాజుకు విచారం పట్టుకుంది. పాపభీతి బాధించింది. నిరాహారుడై అంపశయ్యమీద పడి ఉన్న భీష్ముడి దగ్గరకు వెళ్ళాడు. తక్కిన పాండవులు, కృష్ణుడు, పరివారము ధర్మరాజును అనుసరించారు.

అందరూ కురుక్షేత్రంలో భీష్ముడున్న ప్రదేశానికి చేరుకున్నారు. ఆ మహాత్ముడికి నమస్కరించారు. ఆ సమయంలోనే రాజర్షులూ దేవర్షులూ కొందరు శిష్య సమేతంగా అక్కడికి వచ్చారు. వారిలో పేర్కోదగ్గవారు బృహదశ్వుడు, భరద్వాజుడు, పరశురాముడు, పర్వతనారదులు, వేదవ్యాసుడు, కశ్యపుడు, ఆంగిరసుడు, కౌశికుడు, ధౌమ్యుడు, సుదర్శనుడు, శుకుడు, వశిష్ఠుడు, ఇలా అందరూ రావడం చూసి భీష్ముడు సంతోషించాడు. దేశకాలానుగుణంగా మనసులోనే వారందరినీ వేరు వేరుగా అర్చించాడు. కృష్ణుణ్ణి ప్రత్యేకంగా పూజించాడు. తనవారైన పాండవులను దగ్గర కూర్చోబెట్టుకున్నాడు. అతని కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. అనురాగం పొంగిపొర్లింది. ఆప్యాయంగా మాట్లాడాడు.

నాయనా ! కృష్ణుడు, ధర్మము దిక్కుగా భావించి మీరు జీవించారు. ఇటువంటి మీకు కూడా ఇన్ని కష్టాలా ? విచిత్రంగా ఉంది. పాపం మీ అమ్మ కుంతి కొంచెం సుఖానికి కూడా నోచుకోలేదు. మీ తండ్రి పాండురాజు మరణించినప్పట్నుంచి మిమ్మల్ని పెంచి పెద్ద చేసింది. అంతా కాలమహిమ.

గాలి వల్ల కదిలే మేఘాలు ఆకాశంలో కలుసుకుంటూ విడిపోతూ ఉంటాయి. ఆ విధంగానే కాలాధీనులైన ఈ ప్రపంచ ప్రాణులందరూ కూడా కలుసుకుంటూ విడిపోతూ ఉంటారు. ఎప్పుడూ ఒకేవిధంగా ఉండరు. విచిత్రమైన ఈ కాలమే అన్నిటినీ చేస్తూ ఉంటుంది. ఎటువంటి వారికైనా ఈ కాలం దాటరానిది సుమా ! లోకేశ్వరుడైన విష్ణువు ఎప్పుడు ఎవరికి ఏమిచేస్తాడో తెలియదు. దీన్ని ఎవరూ తెలుసుకోలేరు. మహాత్ములు, విద్వాంసులు అయిన గొప్పవారు కూడా ఆయన మాయలో పడి అంధప్రాయంగా మసలుతూ ఉంటారు. కాబట్టి దైవసంకల్పం దాటరానిది.

శ్రీమన్నారాయణుడు ధర్మరక్షణ కోసం శ్రీకృష్ణుడుగా యదుకులంలో అవతరించి తననెవరూ పసిగట్టలేనివిధంగా రహస్యంగా సంచరిస్తున్నాడు. తన మాయచేత ముల్లోకాలను మోహింపజేస్తున్నాడు. అతడు దేవకీ కుమారుడనీ, మేనమామ కొడుకనీ, మీరు తలపోశారు. దూతగా, మంత్రిగా, సారథిగా, బంధువుగా, స్నేహితుడిగా భావించి పనులు చెప్పారు. అయినా ఆయనకు వచ్చిన లోటేమీ లేదు. ఆయన ద్వంద్వాలకు అతీతుడు. ఆయన భగవంతుడు కాబట్టి భక్తవత్సలుడు కాబట్టి భక్తులకు అందుబాటులోనే ఉంటాడు. అటువంటి శ్రీకృష్ణుడు నా మరణ సమయంలో నా దగ్గరకు రావడం నా అదృష్టమే. నేను పూర్వజన్మలో ఎంత పుణ్యం చేశానో ఏమో '.

అర్జునుడు ఏర్పాటు చేసిన బాణాల పాన్పుమీద పడుకొని ఉన్న భీష్ముడి మాటలను అక్కడ గుమికూడిన వారందరూ విన్నారు. తరువాత ధర్మరాజు భీష్ముణ్ణి అనేక ధర్మాలు అడిగి తెలుసుకున్నాడు. ఉపాఖ్యానాలు, ఇతిహాసాలు తెలుసుకున్నాడు. భీష్ముడు ధర్మరాజు అడిగిన అన్నిటినీ తెలియజేశాడు. కొన్నిటిని వివరంగా చెప్పాడు. మరికొన్నిటిని క్లుప్తంగా తెలియజేశాడు.

ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చిందని భీష్ముడు గ్రహించాడు. తన శరీరాన్ని విడవడానికి తగిన సమయం అదే అని గుర్తించాడు. మౌనం వహించాడు. తన చూపును కృష్ణుని ముఖంమీద నిలిపాడు. కృష్ణుడు కూడా ఎంతో ప్రసన్నంగా భీష్ముణ్ణి చూశాడు. ఆ చూపు భీష్ముడి శరీరానికి తగిలిన గాయాలను, వాటివల్ల కలిగిన బాధను నశింపజేసింది. భీష్ముడు ఎంతో భక్తితో శ్రీకృష్ణుణ్ణి స్తోత్రం చేశాడు.

అందమైన శ్రీకృష్ణుడి రూపం తన అంతరంగంలో అధివసించాలని భీష్ముడు ఆకాంక్షించాడు. రెండు సైన్యాల మధ్య రథం నడిపిన శ్రీకృష్ణుడు తన హృదయపద్మం మీద నెలకొన్నట్టు గుర్తించాడు. గీతోపదేశం చేసిన గీతాచార్యుని మీద భక్తి ఏర్పడాలని అభిలషించాడు. పార్థసారథి ఉద్యమాన్ని ప్రశంసించాడు. తాను సృష్టించిన ప్రాణులందరిలోనూ ప్రకాశించే ప్రభువును ప్రవిమలహృదయంతో ప్రార్థించాడు. భీష్ముడు మనసు ద్వారా, మాటల ద్వారా, చూపుద్వారా, భగవంతుడైన శ్రీకృష్ణుణ్ణి తన హృదయంలో పదిలపరచు కున్నాడు. నిశ్వాసాన్ని నిరోధించి భగవంతునిలో ఐక్యమయ్యాడు.

అక్కడున్న మునులందరూ మౌనం వహించారు. దివ్యదుందుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది. ధర్మరాజు తమ్ముళ్ళతో కలిసి భీష్ముడికి ఉత్తరక్రియలు నిర్వహించాడు. మునులంతా కృష్ణుడి రూపాన్ని అవతార లీలలను స్మరిస్తూ సంతోషంగా తమ ఆశ్రమాలకు వెళ్ళారు.

శ్రీకృష్ణుడంతటివాడు కూడా కురువృద్ధులను కలుసుకొని ఓదార్చడం ప్రతివారూ పాటించవలసిన సామాన్య ధర్మాన్ని బోధపరుస్తూ ఉంది. ధర్మరాజు పశ్చాత్తాపం, పాపభీతి ప్రతివారూ అలవరచుకోవలసిన సద్గుణాలే. భీష్ముడు లేవలేని పరిస్థితిలోనూ వచ్చిన వారందరినీ యథోచితంగా సత్కరించడం మానవధర్మాలకు అతడిచ్చే ప్రాధాన్యతను ప్రస్ఫుటం చేస్తుంది. కాలవైఖరిని గాంగేయుడు తెలియజేసిన వైనం స్థితప్రజ్ఞతావశ్యకతను తెలియపరుస్తుంది. విష్ణుమాయను విదితం చేస్తుంది. ఉత్తరాయణ పుణ్యకాలాన్ని గుర్తించి మనసును కృష్ణుడిమీద లగ్నం చేసి శరీర పరిత్యాగం చెయ్యడం భీష్ముడి సుజ్ఞాన పరిపక్వతను ఆవిష్కరిస్తుంది.

ధర్మాభిషేకం : ధర్మరాజు తమ వారందరితోనూ కలిసి హస్తినకు వెళ్ళాడు.

గాంధారితో కలిసి ఉన్న ధృతరాష్ట్రుని అనుజ్ఞ తీసుకొన్నాడు. శ్రీకృష్ణుడి ఆమోదం పొందాడు. తమ పూర్వులు పరిపాలించిన రాజ్యభారాన్ని స్వీకరించాడు.

ధర్మరాజు ధర్మబద్ధంగా ప్రజలను పాలించాడు. అతని పరిపాలనలో వర్షాలు సక్రమంగా కురిశాయి. పంటలు బాగా పండాయి. ఎటువంటి ఈతి బాధలు లేక ప్రజలు జీవించారు.

ధర్మరాజు పరిపాలన ఎంతో ఆదర్శప్రాయంగా సాగినట్టు దీన్నిబట్టి తెలుస్తూ ఉంది. రాజుధర్మాత్ముడైతే ప్రజలు కూడా ధర్మబద్ధంగా జీవిస్తారు. వారి దేశం సుభిక్షంగా శోభిస్తుందని బోధపడుతుంది.

వంశాంకుర పరిరక్షణ : కృష్ణుడు వ్యాసాది మహర్షుల పూజలందుకొని ద్వారకకు బయలుదేరాడు. ఉద్ధవుడు, సాత్యకి అతన్ని అనుసరించారు. కృష్ణుడు రథమెక్కుతుండగా ఉత్తర పరుగు పరుగున అక్కడికి వచ్చింది. ' దేవదేవా ! ఎక్కడి నుంచో ఏదో ఒక బాణం వస్తూ ఉంది. నా కడుపులోని పసికందును రూపుమాపాలని చూస్తూ ఉంది. దాని బారి నుంచి రక్షించగల సమర్థుడు నువ్వు మాత్రమే. నా గర్భాన్ని రక్షించు' అని శ్రీకృష్ణుణ్ణి వేడుకొంది.

లోకంలో పాండవులు నశించాలని అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రమే అది అని కృష్ణుడు గుర్తించాడు. ఇంతలో ఆ బ్రహ్మాస్త్రం నుంచి ఎన్నో బాణాలు వెలువడి పాండవులను చుట్టుముట్టాయి. శ్రీకృష్ణుడు తన వైష్ణవతేజంతో ఆ బాణాలన్నిటినీ నశింపజేశాడు. ఆ బ్రహ్మాస్త్రాన్ని నిర్వీర్యం చేశాడు. వైష్ణవ తేజస్సుతో ఉత్తర గర్భంలోనూ ప్రవేశించి ద్రౌణి బాణ ప్రభావాన్ని పూర్తిగా నశింపజేశాడు. ఉత్తర గర్భంలోని పాండవ వంశాకురాన్ని పరిరక్షించాడు."

సూతుడు చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకున్నాడు. శౌనకుడు వెంటనే సూతుణ్ణి ప్రశ్నించాడు. మహర్షీ! శ్రీకృష్ణుడు అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం బారి నుంచి ఉత్తర గర్భంలోని పసికందును ఎలా రక్షించాడు? ఆ వృత్తాంతాన్ని సవిస్తరంగా తెలియజేయి ". సూత మహర్షి చెప్పడం మొదలెట్టాడు.

సమాజంపై పారమార్థిక గేయాల ప్రభావం

(మార్చి సంచిక తరువాయి)

– డా ॥ ఎడ్ల బాలకృష్ణారెడ్డి (చిత్తూరు)

ఆధ్యాత్మికత : ఆత్మజ్ఞానానికి సంబంధించినది ఆధ్యాత్మికత. సర్వభూతేషు గూడో ఆత్మ " అని కఠోరపనిషత్తు సకల జీవులయందు ఆత్మని గూఢంగా దేహాన్ని అధిష్టించి ఉంటుంది. ఈ దేహమనే రథానికి ఆత్మ యజమాని. ఇంద్రియాలు గుర్రాలు. బుద్ధిసారథి, మనస్సు కళ్ళెం, మనస్సు అనే ఉపాధితో కూడిన ఆత్మకు ' జీవాత్మ ' అని పేరు. పరమాత్మకే పరబ్రహ్మమని కూడాపేరు. " అంతా బ్రహ్మమయం. ఈ జగమంతా బ్రహ్మమయం " అని తత్త్వజ్ఞుల భావన.

ఆత్మ జీవులయందుని గూఢంగా
" తిలలోన తైలంబు దీపించునటువలె
పాలలో నెయ్యి యేర్పడినయట్లు
పువ్వులో తావి పొసగిన విధమున
యమృతంబు శశియందు తనరుక్రియను "

దివ్యశక్తి రూపంలో దాగి ఉంటుంది. పుణ్యపాపకర్మలు మనసుతో కూడిన జీవునకే గాని, సాక్షిభూతంగా నున్న ఆత్మను అంటవు. తనను తాను ఎరుంగుటే ఆధ్యాత్మిక జ్ఞానం.

పరబ్రహ్మ కోసం ఎక్కడో వెతకనక్కరలేదు. సూక్ష్మ రూపంలో తనలోనే ఉంటాడని తెల్పే తత్త్వకీర్తన.

" తనయందున్నదిరా – బ్రహ్మం తనయందున్నదిరా ! తనయందున్నది తప్పక జూచితె తాను నేననె భేదములుడిగితె " – తనను తాను తెలుసుకుంటే తానే బ్రహ్మము. ఈ ఆత్మజ్ఞానం

తెలిసినవారు మహాత్ములు. జీవన్ముక్తులు.

ఆశ – సంతృప్తి : ఆశ అంటే కోరిక. మోక్షానికి ఆటంకం కోరికలు. అందుకే వేదాంతులు ఆశను పిశాచంతోను, శత్రువుతోను పోల్చుతారు. కామ క్రోధాదులు కోరికలకు మూలం కారణం. అవి నిందవచ్చు పనులను చేయిస్తాయి. ఆశకు విరుగుడు సంతృప్తి.

ఉన్న దానితో తృప్తి చెందడం సద్గుణవంతుల లక్షణం. సంతృప్తి గల వారిని దేవుడు ప్రేమిస్తాడు. సంతృప్తి వల్ల వివేక వైరాగ్యాలు బలపడుతాయి. శాంతి కలుగుతుంది. సంతృప్తితో జీవించడంలోనే జీవన సౌందర్యం ఇమిడి ఉంది.

" వస్తా వట్టిది పోతా వట్టిది – ఆశ లెందుకంటా
పోయే నాడు వెంబడి రాదు పూచికపుల్లయినా " మొదలైన తత్త్వాలు ఆశాపాశాన్ని త్యజించుమని హితవు పలుకుతున్నాయి.

" ఆశలుడిగిన యపుడె, అజ్ఞానములు తొలగు
ఆశలుడిగిన యపుడె, అన్ని భ్రాంతులు పోవు
ఆశలుడిగిన ననంత అధిక తృప్తుండగు
ఆశలుడిగిన యపుడె అకలంకు డౌను "

పారమార్థిక మార్గానికి ఆటంకమైన, దురాశలకు దూరంగా ఉండాలని, సంతృప్తిని పొందాలని వేదాంతుల ఉవాచ.

నైతిక ప్రవర్తన : నీతి నియమాలతో, దైవీ సంపత్తితో ధర్మబద్ధంగా జీవించడమే నైతిక ప్రవర్తన.

పారమార్థిక ప్రగతికి నైతిక వర్తన అవశ్యం. ఇది ఇహపరసాధకం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి మానవతా విలువలను పాటిస్తూ " ధర్మోరక్షతి రక్షితః ॥ అని నమ్మి, దైవభక్తితో జీవించడం

మనిషి ప్రధాన కర్తవ్యం. నైతిక ప్రవర్తనతోనే ఆదర్శ జీవనం సాధ్యం.

నీతిని బోధించి, సత్ప్రవర్తన మార్గం చూపించి, సంఘంలో నడచుకోవలసిన విధానాన్ని తెల్పే ప్రబోధాత్మక గేయాలు అనేకం కన్పిస్తాయి. మచ్చునకు.

" పరసతిని తల్లిగా భావించవే మనసా !
పరధనంబుల కాసబడకుమా మనసా !
పరనింద నెయ్య బలుక బూనకె మనసా!
పరతత్త్వమున గూడ బ్రతుక వె మనసా ! " ఇవి మానస ప్రబోధకాలు.

మంచిని పెంచే, మనస్సులో చేర్చుకో దగ్గ మరికొన్ని నీతులను పరికిద్దాం.

" సత్యమే జయమనుచు నమ్మండి జనులారా !
నిత్యమ సంగవాదుల సంగమొదలండి "
తప్పు సాక్ష్యము చెప్పబోకండి – ఏనాటికైనా
తప్పుద్రోవల తిరుగబోకండీ !
పరహితవు మరువకు, పేదలను బాధించకు
నీతి దప్పక నేర్పుతో మసలుకో మనస "
ఓపితే పుణ్యాము చేయి, వోపకుంటే వూరుకో !
పాప మూలుశేయబోకు, పది వేలగు జీవుడా !
మానవ జన్మము లెత్తినందుకు మంచి పనులు సేవండీ !
హీన కృత్యములు మానకయుండిననేన పాయమనకండీ !
ధనము గలిగిన యుబ్బియుండకు
దానధర్మము తప్పినడువకు
మరుని శరముల చిక్కియుండకు

మాటదప్పకుమీ !

ఇత్యాది నీతులు, సత్ప్రవర్తన మార్గంలో నడిపించడానికి హితప్రాప్తికి, అహిత నివృత్తికి, దోహదకారి మానవ శ్రేయస్సుకు, శాంతికి రహదారి.

పలు సూక్తులతో నిండిన ఈ క్రింది గేయాన్ని పరిశీలించండి.

" గోవిందుడే వేల్పు, కోపమెపగదాయె
దైవబలమె బలము, ధర్మమె జయము ॥ గోవిందు ॥
కరుణాయె చుట్టంబు, గాయత్రియె జపము
పరపీడనము మహాపాతకంబు ॥ గోవిందు ॥
గురుడుయె దైవంబు, దుర్గోష్ఠియె నరకంబు
పరహితవె సుకృతంబు, ప్రాణమె తీపి
కరివరదుడగు ఘనత వెంకటపతి
చరణమే యిహపర సాధనంబు ॥ గోవిందు ॥

ఇటువంటి నైతిక ప్రవర్తనకు పనికివచ్చే పారమార్థిక గేయాలు ఇహపర సాధకాలు.

సంఘ సంస్కరణ : సమాజంలోని అవకతవకలను సరిదిద్ది, జ్ఞానబోధ చేయడం సంఘ సంస్కరణ. మూఢవిశ్వాసాలను, కాపట్యాన్ని, దురాచారాలను ఖండించి సంస్కరించడానికి తత్త్వకర్తలు ప్రయత్నించారు.

దూదేకుల సిద్ధయ్య

" ఏ కులమని నను వివర మడిగితే
యేమని దెల్పుదు లోకులకు " అని కుల వ్యవస్థను సమాజంలోని హెచ్చు తగ్గులను ఈసడించినారు.

" స్త్రీ పురుషులనే కులము సృష్టి లోపలను
రెండు రూపులై యున్నవి రూఢిగాను " అని చెప్పి
" కులమెంచగా నేల గుణమె కారణము " అన్నారు.

అలాగే మతాలు వేరైనా పరమాత్మ భావం మాత్రం ఒక్కటే అని చాటి చెప్పినారు.

" ఆవుకు రంగులుంటాయి గాని
ఆ – ఆవు పాలకు రంగులుంటాయా ? అని ప్రశ్నించి మతాలు వేరైనా పరమాత్మ ఒక్కడేనని ప్రకటించాడు.

కాపట్యాన్ని, మోసాన్ని కూడా వేదాంతులు నిరసించారు. పొట్ట కూటికై వేషం మార్చే వారిని గురించి

" కాషాయ వస్త్రము గట్టి, కాళ్ళకు పావులు బెట్టి
యీషణత్రయములను గెలువకు యిలను
పరమ జ్ఞానము తెలియని భ్రష్ఠ యోగులకు " మోక్షం సిద్ధించదని అన్నారు.

" బాధ గురువుల నమ్మబోకండి – జనులారా
బోధ గురువుల వెతకండి – అని హితవు పల్కినారు.

వ్యసనాలను లోను కావద్దని హితవు పలికిన తీరు చూడండి.

" కల్లు సారాయి తాగడమయ్యో, కటకట యెంతటి తప్పండీ !
బీడీలు పట్టబోకండి, ఇలజనులు మీరు బీడీలు పట్టబోకండి " అని ప్రబోధించి సంఘ సంస్కరణకు కృషి చేశారు.

జీవహింస మహాపాపమని, అహింసా మార్గంలో పయనించదని హితవు పలికిన తత్త్వాలు పలు ప్రచారంలో ఉన్నాయి. మలయాళస్వాములవారు.

" మాంస భక్షణము మానండీ – పరమాత్ముని మదిలో నమ్మండీ
హంస నెరింగిన అనుభవపరులై హింసకులోబడ నేల వినండీ !

జీవుల మొరనాలించండీ – అవి దేవుని బిడ్డ లేయనుకోండి
జీవులపై దయలేని కఠినులకు జీవ బ్రహ్మైక్యము లేదండీ ॥ మాంస ॥
ఈ గేయ ప్రభావంతో పలువురు శాకాహారులైనారు.

హింసను విడనాడితే మనిషికి శత్రువులే ఉండరు. ఎల్లెడలా శాంతి తాండవిస్తుంది. భగవంతునికి యిష్టమైన పుష్పాల్లో అహింసయే ప్రథమ పుష్పం. " అహింసా పరమో ధర్మః ".

పారమార్థిక గేయాలు – సమాజంలో అభ్యుదయాన్ని, మంచిని పెంచడానికి, విశ్వశాంతికి ఎంతగానో దోహదకారి. **ఓం తత్ సత్.**

ఉపయుక్త గ్రంథం జానపద పారమార్థిక గేయ సాహిత్యం స్వకీయం

ఆశ్రమ అన్నదాన నిధికి సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈ క్రింది వారు పైకం ఇచ్చినారు

1. కావుటూరు సుబ్బరాయుడు (రిటైర్డ్ ప్రొఫెసర్,టి.కమ్మపల్లి) - రూ.25000/-
2. గంగుల లక్ష్మీనర్సయ్య (ముంబాయి) - రూ.15000/-
3. పి.శైలజ (చిత్తూరు) తండ్రి పేర భిక్షానిధి - రూ. 15000/-
4. పి.వరలక్ష్మి (చిత్తూరు) తల్లి పేర భిక్షానిధి - రూ. 15000/-
5. వల్లం కొండ ప్రభులింగం (మహబూబ్‌నగర్)- రూ.21000/-
6. ఎస్.శ్రీనివాసులు, ఎస్.శివపార్వతి (నెల్లూరు) - రూ.20000/-
7. ఆర్.దామోదరనాయుడు (చిత్తూరు) - రూ.20000/-
8. ఆర్. జానకి (చిత్తూరు) - రూ.10000/-
9. ఆర్.సతీష్ (చిత్తూరు) - రూ.10000/-
10. ఆర్. గాయత్రి (చిత్తూరు) - రూ.10000/-

గోమాత సేవ

రచయిత : గురుదాస్. మిట్టపల్లి, శంకరయ్య

పల్లవి :
రేపల్లె వాడలోన గోమాతను రక్షించ
అవనిపై కొస్తివి కృష్ణయ్య
రామకృష్ణ పాట నేర్వ గోమాతను రక్షించ
మళ్లీ ఒక్కసారి నీవు రావయ్య
కానీ దయలేని వారు కాసుల కోసం నన్ను
కసాయికమ్ముతారు కృష్ణయ్య
ఏమి కాలమొచ్చెగాని కాని ఎంత చెప్పినా వినరు
నా ఉనికే కరువాయే కృష్ణయ్య

చరణం :
అమ్మతోటి వస్తినని వారికి నే చెప్పితిని
రంకెలేసే కోడెలు నీకిస్తినంటిని
దుక్కిదున్ని చేను చేసి రాసులు నే పోస్తిని
పాడిపంట సమృద్ధిగా నీ ఇల్లు నింపితి **!! రేపల్లె !!**

చరణం : 2
పసిపాపకు జన్మనిచ్చి కన్న తల్లి కన్నుమూస్తె
ఇంటిల్లిపాది గోడున గోడున ఏడ్చిరి
పరుగెత్తీ నేనొచ్చి ఉన్న తల్లినైపోతి
కమ్మనైన గుమ్మ పాలు కడుపు నిండ నేనిస్తి **!! రేపల్లె !!**

చరణం : 3
గోమూత్రం ఔషధమని వారికి నే బోధిస్తి
గోయమము ధన లక్ష్మి యని నే తెలిపితిని
పాడిపరిశ్రమతోనే భరత భూమి వర్ధిల్లు నని
గోమాతను సేవించి దేశ రుణం తీర్చమంటి **!! రేపల్లె !!**

చరణం : 4
ధాన్యరాసులమ్మివేసి నీకు ఇల్లు కట్టించి
అరిష్టాలు తొలగించ తొలిపాదం నే పెడితి
ముసలి దానినైతే నీకెట్లా బరువయితీ
దేవతలకు నిలయము నా దేహము నీకంటి **!! రేపల్లె !!**

జ్ఞాన సదస్సు

శ్రీకాళహస్తిలోని శ్రీ శుకబ్రహ్మాశ్రమమునందు ప్రతి నెల శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు **5 రోజులు జ్ఞాన సదస్సు నిర్వహింప బడును.**

ప్రతి రోజూ ఉదయం – 1. మంత్రజపము, 2. ధ్యానము, 3. ఆధ్యాత్మిక **పాఠము (సదస్సు)**

సాయంత్రం : 1. ఆధ్యాత్మిక పాఠము, 2.జపము, 3.ధ్యానము, 25 మంది సాధకులకు మాత్రమే ప్రవేశము. నివాసము, భోజనాదులు ఉచితము. అభ్యర్థనా పత్రములు ఒక నెల రోజులు ముందు పంపవలెను.

ప్రథమ సదస్సు : 2017 జూన్ నెల 5వ తేదీ జ్యేష్ఠ ఏకాదశి నుండి 9వ తేది పౌర్ణమి వరకు 5 రోజులు **ఆచార్యులు పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు (వశిష్ఠాశ్రమము),**

పాఠము : పంచభ్రమ నిరూపణ, భగవద్గీత స్థితప్రజ్ఞ లక్షణములు

ద్వితీయ సదస్సు : జూలై 4వ తేదీ ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి 8 పౌర్ణమివరకు **ఆచార్యులు పూజ్యశ్రీ పరావిద్యానందగిరి స్వామినివారు (యాజ్ఞవల్క్యాశ్రమము)**

పాఠము : ఈశావాస్యోపనిషత్తు, భగవద్గీత భక్తుని లక్షణాలు.

తృతీయ సదస్సు : ఆగష్టు 3వ తేదీ శ్రావణ శుద్ధైకాదశి నుండి 7వ తేది పౌర్ణమి వరకు **ఆచార్యులు బ్రహ్మశ్రీ ఓ.యస్. రామలాల్ శర్మ గారు** (ప్రొఫెసర్, తిరుపతి సంస్కృత విద్యాపీఠం)

పాఠము : కేనోపనిషత్తు.

చతుర్థ సదస్సు : సెప్టెంబరు 1వ తేది భాద్రపద ఏకాదశి నుండి 6వ తేది పౌర్ణమి వరకు. **ఆచార్యులు పూజ్యశ్రీ సత్యాత్మానంద సరస్వతి స్వాములవారు,** చిన్మయమిషన్, **పాఠము – కఠోపనిషత్తు.**

పంచమ సదస్సు : అక్టోబరు 1వ తేది నుండి 5వ తేదీ ఆశ్వీయుజ పౌర్ణమి వరకు. ఆచార్యులు పూజ్యశ్రీ యజ్ఞానందసరస్వతి స్వాములవారు (చిన్మయమిషన్). **పాఠము : ముణ్డకోపనిషత్తు.**

తెలుగులో బోధన ఉండును. శ్రీ శుకబ్రహ్మాశ్రమ సదస్సులో పాల్గొనదలంచువారు **వెంటనే వివరాలకు జవాబు కవరుతోటి ఆశ్రమానికి వ్రాయవలెను. మీ పేర్లు రిజిష్టర్ చేసుకోవలెను.** ఇట్లు

శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘము,

శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు) – శ్రీకాళహస్తి – **517640,** చిత్తూరుజిల్లా

వార్తలు

(01). ఏప్రిల్ 30వ తేది ఆదివారం వైశాఖ శుద్ధ పంచమినాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జగద్గురు శ్రీ శంకరాచార్యులవారి జయన్తి సందర్భంగా శ్రీ జగద్గురు శంకరాచార్యుల వారికి షోడశోపచార పూజ జరిగినది.

(02). చిత్తూరు జిల్లా, పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామము నందు నూతనంగా నిర్మించిన శ్రీ నీలకంఠేశ్వర దేవస్థానంలో 8-5-2017వ తేది సోమవారం ఉదయం 10 గంటలకు జరిగిన మహాకుంభాభిషేకంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని మహా కుంభాభిషేకం చేశారు. ఆ తరువాత అనుగ్రహభాషణం చేశారు. వేలాది మంది పరిసర గ్రామస్థులు కూడ ఇందు పాల్గొనినారు. శ్రీ పుండరీక వరదానంద స్వాములవారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగినది.

(03). 10-5-2017వ తేది బుధవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో విశేషంగా గురుపాదుకా పూజ జరిగినది.

(04). వైశాఖ శుద్ధ పంచమి నుండి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో పూజ్యశ్రీ స్వాములవారు ఉదయం సాధనా పంచకము, సాయంకాలం నారద భక్తి సూత్రాలపై ప్రవచన చేస్తున్నారు.

(05). 4-5-2017వ తేది గురువారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో సద్గురు సర్వ సేవా ట్రస్టు బోర్డు సమావేశం జరిగినది.

(6). 6-5-2017వ తేది, 22-5-2017వ తేదీలలో ఏకాదశుల సందర్భంగా భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ జరిగినది.

(07). 24-5-2017 తేది మాసశివరాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో శ్రీ నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం బిల్వార్చన జరిగినది.

(08). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఏప్రిల్ నెలలో ఓ.పి.లో **816** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **75** మందికి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **10** మందికి లేజర్ చికిత్సలు చేయబడినది.